*కేకలు రెండు రకాలు. కడుపు మంట కేక ఒకటి. గుండె మంట కేక మరొకటి! ఈరిగాడి కేక ఈ రెండూ కాని, రెండూ కలిసిన చావుకేక.*

సూర్యుడు ఊరు బయట పొలాల వెనుక కొండచాటుకు మరో ప్రపంచాన్ని వెలిగించాలని పోయినవేళ. చీకటి ముంచుకు రాకముందే గూళ్ళు చేరుకోవాలని పక్షులు సందడిగా ఎగురుతున్న వేళ. పెదకాపు పిలుపుకు ఈరయ్య వచ్చి అతని ముందు చేతులు కట్టుకొని నిల్చున్నాడు. నిటారుగా నిల్చునే ధైర్యం ఉండకూడదు కనుక కొద్దిగా ముందుకు వంగి గూనివాడులా కనిపిస్తున్నాడు.

పెదకాపు గుబురు మీసాల మధ్య

# కేక

## సంధ్యా రంగారావు



చుటను సుతారంగా వెలిగించి.... గుప్పున పొగ వదులుతూ....ఆరిపోయిన అగ్గిపుల్లను అరుగు అంచు చివరకు పడేలా విసిరి. "ఈరిగా" అంటూ పిలిచాడు. పిలుపుతో పాటు నోటినిండా పూరిన ఉమ్మను కాండ్రించి ఊసేసరికి ఈరయ్యకు రెండు గజాల ముందర పడింది.

"బాంచెను" అంటూ ఈరయ్య నడుమును మరి కొంచెం ముందుకు వంచాడు.

పెదకాపు అగ్గిపెట్టెను చొక్కా జేబులో వేసుకుని మరోమారు పొగను గట్టిగా దమ్ములాగి వదులుతూ "పొద్దుటినుంచి ఏడసచ్చినావురా పుల్లన్ని యింటికాడికి తోలేత్తే లేవని తెలిసింది" అంటూ అడిగాడు.

పెదకాపు అడుగుటయే ఆలస్యం ఈరయ్య ఇంట్లోని, ఒంట్లోని బాధలను పెదకాపు ముందు క్రుమ్మరించాడు.

"బాంచెను కాల్మొక్త.... సంటిదానికి జొరం గుంటె ఆచారి కాడకు పల్లెకు తీసుక పోయిన రాత్రినుంచి కంటిమీద కునుకు లేదు. యింటికి వచ్చేసరికి ఇల్లిగాడు రెండు మాట్లువచ్చి పోయిండని అయ్య సెప్పిండు. ఎంటనే రెక్కలుకట్టుకువచ్చిన బాంచెను."

ఈరయ్య చెప్పిందంత సానుభూతితో ఆలకించాడు పెదకాపు.

"సర్లెగాని రేపటినుంచి నీతో పనిబడిందిరా?"

"గులాపోన్ని తమరు సెప్పిన పని ఎప్పుడు కాదంటిని."

"మరి మనూరికి మంత్రిగారొస్తాండ్రు" చుట్ట పొగ గుప్పున వదిలాడు పెదకాపు

ఈరయ్య చెవిలో మంత్రం పూదినట్లే అయింది.

తన చెవులు విన్నది నిజం కానట్టుగా "మనూరికి మంత్రిగోరే" అన్నాడు బోలెడు ఆశ్చర్యంతో.

పెదకాపు మీసాల చాటున పెదవులు ముసిముసిగా నవ్వుకున్నాయి. కళ్ళల్లో అదోరకమైన తృప్తి విరిసింది. కాలుతున్న చుట్టకొనవేపు గర్వంగా చూస్తూ.... చివరన ఏర్పడిన బూదిని దులిపి "అవున్రా మంత్రిగోరే" అన్నాడు.

తను విన్నది అబద్ధంకాదన్న నమ్మకం కుదిరాక ఆనందంతో శరీరం పొంగిపోగా ఏమనాలో "అర్థంకాక "బాంచెను" అని మాత్రం అనగలిగాడు ఈరయ్య.

సంతోషంతో అతని నడుం నిటారుగా లేచి మళ్ళీ అపచారం చేసినట్టుగా ముందుకు వంగిపోయింది.

"అందుకని జరుగురుగా మనం కొన్ని పనులు సెయ్యాల" ఆజ్ఞ జారీ చేశాడు పెదకాపు.

"నిత్తం...." ఈరయ్యను ఇంకా మంత్రి పదం నింపిన మత్తు విడువ లేదు.

"మరి యీదులన్నీ బాగుసేయాల"

"నిత్తం. బాంచెను."

"సావడికి సున్నం కొట్టాల.... తాటి మట్టలు తెచ్చి పందిళ్ళేయాల"

"బాంచెను "

"మంత్రిగారికి యిందు మనింట్లోనే ఏర్పాటు సేత్తాన.. అందుకని మన యింటి హమామ్‌ఖాన్ల నుంచి ఈదిలోకి పారే మురికి కాల్వను పూడ్చాలె. మన మోట బావికాడ యేతాన్ని తెచ్చి ఆ కాలువల నింపాల. మంత్రిగారొచ్చి పోయే దాన్క

నీళ్ళు పోయేందుకు హమామ్‌ఖానేనే ఓ గొయ్యి తవ్వాల."

"సిత్తం బాంచెను."

"పోఁగాన్కి పైసన్కి కూడా సెప్పిన ఈ నాల్రోజులు గూడెమంత ఈడనే పని సేయాల"

"సిత్తం."

"మంత్రిగారొచ్చి మీ మాదుగులకు యిండ్లు కట్టిత్తరు."

"మా అందరికా బాంచెను."

పెదకాపు మనసులోనే నవ్వుకున్నాడు.

"అవున్రా మీకే" అన్నాడు ఆరిపోబోయే చుట్టను గట్టిగా పీల్చి రగిలించబోతూ.

బాంచెను" అంటూ ఈరయ్య దేవిడీ వెనుకకు పోయినాడు.

పెదకాపు ఆరిపోయిన చుట్టను తిరిగి వెలిగించడం కోసం అగ్గిపెట్టె తీసినాడు.

* * *

ఈరయ్య మాట వింటూనే సమ్మక్క చుండిపడింది.

"ఏందయ్య సోద్యం. పిల్లది జొరంతో మూసిన కన్ను తెరుస్తలేదు. మందిప్పియ్య కుండ నువ్విలా రోజు మంత్రిగారి కాడికి పోతె ఎట్ల సంటి దాని బ్రతుకేంగావాల."

ఈరయ్య కసురుకున్నాడు.

"ఊర్కోయె హె ఆచారి సెప్పిండ్రు గద.. భయం లేదని. వారం రోజుల్ల తక్కువయిద్దని.... మందుగూడ యిచ్చె"

"ఆఁ.. సర్లె.. ఆచారిగోరి పసరు.. నా బతుకు.. బిరాన పట్నం తీస్కపోయి ఇంగిలీసు మందిప్పియ్య కుంటే నాకు శాన భయంగుందయ్య."

ఈరయ్య మరింత సిరాకుపడి "యిప్పుడేడ ఈలవుద్దే. మంత్రిగారొచ్చెరోజు

"ఏందే ఒళ్ళు తిమ్మిరెక్కతానాదే. పాసి బువ్వ కాకపోతే పరవాన్నం వత్తగను కున్నావె. దొరుసాని పనుకుంటానవెందే"

అతని కండ్లు నిప్పులు కురిపించాయి.

సమ్మక్క గుడ్ల నీరు కుక్కుకుని అక్కడినుంచి లేచి గుడిసె లోపలికి పోయింది.

"ఏందిరా ఈరిగా కోడలిని అట్ల కోప్పడతాన్నవు" అప్పుడే అక్కడికి వచ్చిన ఈరయ్య తండ్రి ముసలయ్య అడిగాడు. చేతికర్రను గుడిసె గోడకు ఎండిన తాటాకుల చూర్కిందుగా ఆనిస్తూ.

తండ్రిని చూసేసరికి ఈరయ్య కోపం సగం తగ్గిపోయింది.

"ఏం లేదె హె దొర్సానికి పరవాన్నం కావాల్నంట."


"అది అట్లా అడిగినాదిరా?"

ఈరయ్య మాట్లాడలేదు.

"ఒరేయ్ ఈరిగా దాన్నట్ల అంటె తప్పుల పడతావురా.... అది మన యింటి లచ్మిరా దాన్నేవన్న అంటె కండ్లు పోతాయిరా."

ఈరయ్యతల క్రిందకు వాలిపోయింది.

"ఈరిగా రొండ్రోల్నుంచి విన్న సూత్తాన యింటికాడి సంగతేది పట్టించుకుంట లేవైతివి. మంత్రిగోరని దేవిడీలోనే కూకుండబడ్తివి. నువ్వట్ల దేవిడీల కాకుంటె ఆడికూతురు దాని కట్టం సూసేదెవర్రా.. సంటిదానికి మందులేక.. కడుపులకు గంజిపోరుకక దాని బాధ సూళ్ళేక



".... .... ...."

"తూర్పు సెరువు మత్తడికి ఆవలి ప్రక్కన్న బంజరుభూమి సూపించిన.... ఆడ సర్కారి తుమ్మలను, పొదుగు తుప్పలను నరికి భూవంత సదును సేయాల. మంత్రిగోరు మీ యిండ్లకు బండ ఆడనే పాత్తరు."

"బాంచెను."

"బువ్వ తిన్నవా. లేకపోతే యింటెన్కకు పోయి దొరసాన్కి కనబడు. సలి బువ్వుంటె ఏసి. గంజి పోత్తది."

"సిత్తం దొర."

"బిరాన పనుల్లో సేరిపోవాల. టైం శానలేదు. అన్ని పనులు తొరగా అయిపోవాల."

"మీరిగ యింతగను సెప్పాల్న

గర పడతాండె కంటికి కనుపియ్యక పోతె పెదకాపు దొక్కచీర్తడు."

"ఏం జేత్తవో. రొండ్రోజుల్నుంచి కూలినాడలేదు ఆకలికి దొక్కలు మాడన్నయి. మంత్రిగారొచ్చి అన్నం పెడ్తరేంటి. పిల్లదానికి మందిప్పిత్తరేంటి."

"మనందరికి యిండ్లు కట్టిత్తరటనే"

"సాల్లే నిర్వాకం. మింగ మెతుకు లేదుగాని.... మీసాలకు సంపెంగ నూనని. ఈడ కడుపులకు కూలి దొరకుత లేదుగాని ఆడ ఎక్కడో యిండ్లెవరికి కావాల్నయ్య."

"దొరుసానిగోరు బువ్వ పెడుతాండ్రు గదే."

"ఆఁ బువ్వ. కుక్కల కెయ్యంగ మిగిలింది. పాసిపోయి దోకొస్తాంది."

ఈరయ్య అసహనంగా లేచి నిల్చుని

పోతాన్నరా."

ముసలయ్య నీరసంతో గుడిసె అరుగు మీద కూర్చుని గోడకు ఒరిగినాడు.

"ఒరేయ్ యిటు సూడు. ఈ సేతులను సూడు. యాభైయేండ్లు ఈ సేతులు ఆ దేవిడీల పనేసినయిరా.. ఆ దేవిడీని కట్టినయి కూడ ఈ సేతులేరా.. అంత పెద్ద దేవిడిని కటిన యీ సేతులు కూలుతున్న ఈ గుడిసెను కప్పుకో లేకపోయినయిరా.... సచ్చిపోతాన్న మీ అమ్మను బతికించుకో లేకపోయినయిరా."

వీపుకు అంటుకుపోయిన పొట్టపైన చర్మం కప్పుకున్న ప్రక్క ఎముకలు దగ్గుకో, ఆయాసంతో రొప్పుకుంటే చేతులతో బలంగా ఛాతిమీద రుద్దుకున్నాడు.

"వద్దంటె గట్టిగ మాట్లాడ్తవు. దగ్గు

తెచ్చుకుంటవు" మందలింపుగా అన్నాడు ఈరయ్య.

ముసలయ్య వగిలిన పెదవులు పేలవంగ నవ్వినాయి.

"ఒరేయ్. ఈ దగ్గు మాటలతో వచ్చింది కాదురా. ఈ కట్టెలోని బలవంత ఆ దేవిడి పీల్చినాక మిగిలిన చెత్తరా యిది. ఇండ్ల దగ్గు ఆయాసం కాక ఇంకేం మిగులుద్దిరా"

ఈరయ్య తండ్రి ఉపన్యాసం విన లేనట్లుగా అసహనంగా కదిలాడు "ఇప్పుడు నన్నేం జేయమంటవే మరి."

ముసలయ్య మూసుకుపోయినట్లున్న కండ్లతో కొడుకును దీక్షగా చూసి "ఏం జేయాల్న ఒరేయ్ ఇటు సూడు నా అయ్య. ఆడెనుక నేను. నా యెనక నీవు నీ తర్వాత నీ కొడుకు ఇట్ల మనం ఎన్ని తరాలు పన్జేసిన ఆ దేవిడిల పని ఒరవదురా. మీరన్న బావు వకండిరా. మన బతుకు లిట్ల తెల్లారనీయకుండిరా నీ తల్లిని నేను సంపుకున్నట్టు నీ కూతుర్ని దూరం సేసుకోబోకురా."

మరోసారి ఆయాసంతో మాట తిరుగక ముసలయ్య ఆగిపోయాడు.

ఈరయ్య మనసంతా తండ్రిమాటలకు కలచివేసినట్లయింది. మంత్రిగారి పదం వలన కలిగిన మత్తు మంత్రగాడు విభూధి చల్లినట్లుగా మాయమైపోయింది. నీరసంగా దేవిడీ వేపు కదిలాడు.

* * *

మంత్రిగారు వచ్చేరోజు దగ్గర పడుతున్నకొద్దీ పెదకాపు ఆరాటం, ఆర్భాటం ఎక్కువయిపోయింది. ఏది ఎక్కడ ఎట్లా వుండాలో అన్న సమస్యలు అంతకంతకు అధికం కాసాగాయి. నోట్లో చుట్ట ఆరిపోకుండా ఆజ్ఞలు యిస్తూ కాలు కాలిన పిల్లిలా దేవిడీ అంతా తిరుగుతూ మనుషులను కుక్కలా తరుముతున్నాడు. లేచి వచ్చిన శవాల్లా అతని తిట్లను భరిస్తూ.... ఆజ్ఞలను పాలిస్తున్నారు పనివారు.

పెదకాపు పెద్ద కుమారుడు బుచ్చిరెడ్డి పట్నంలో పెద్ద చదువులు చదువుతున్నవాడు. తండ్రి దగ్గరనుంచి వచ్చిన కబురందుకుని. ప్రత్యేకంగా మంత్రిగారి ఆహ్వానానికి ఏర్పాట్లు పరిశీలించడానికి వచ్చాడు. ఉరుములేని పిడుగులా వస్తూనే తన అధికారాన్ని పనివారి మిద ప్రదర్శించడం మొదలుపెట్టాడు.

మొదట సంవత్సరాలుగా స్థిర నివాసం ఏర్పరచుకుని తమ ఉనికికి ఇక ఎలాంటి అపాయం లేదనుకున్న గబ్బిలాలను పారద్రోలి. నాటి ఉచ్ఛిష్టాలతో దుర్గంధభూయిష్ఠమైన సావడిని దులిపించి సున్నం వేయించాడు. అవసరమైన చోట్ల రంగులు కూడా పూయించాడు. మంత్రిగారు వచ్చే వీధిఅంతటా వూరు బయటినుంచి సావడి వరకు కుండలతోటి. తోరణాలతోటి అర్చీలు కట్టించినాడు. రంగు రంగుల బల్బులతో సావడీఅంతా మెరిశేలా చేశాడు. మంత్రిగారి సమావేశానికి ఆవూరి ప్రజలు సరిపోరు కనుక చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తీసుకురావడానికి అక్షరాస్యులైన నిరుద్యోగులను

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

## ఇల్లు

స్వేచ్ఛగా వీచే గాలిని
నిరోధిస్తూ
సూటిగా వచ్చే కాంతిని
అవరోధిస్తూ
ఆరుబయట వెలిసిన అందాల
జైలులు - ఇల్లు.

## ఇల్లాలు

జైలులు వంటి అందాల
లోగిలిలో
కాంతి రేఖలూ కటిక చీకట్లూ
కల్పిస్తూ
సంచరించే సమ్మోహనరూపం
-ఇల్లాలు.

— చల్లా రాధాకృష్ణశర్మ

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

ఏర్పరచి వారికి అవసరమైన బండ్లను సమకూర్చాడు చేయవలసిన పనులన్నీ చేసి ఇంకా చేయవలసిన వాటి గురించి ఆలోచిస్తూ పచ్చని పందిట్లో కాసేపు విశాంతిగా కూర్చున్న అతనికి చల్లగా నీడనిస్తున్న తాటాకు పందిళ్ళు అసహ్యంగా తోచాయి అలా తోచడమే తరువాయి నాటిని పీకి పారేసెందుకు ఆర్డర్లు యిచ్చాడు. ఏది ఎందుకు చేస్తున్నారో తెలియని అవస్థలో ఉన్న పనివారు. నిమిషాలమీద అతని ఆజ్ఞలను నిర్వహించడంలో మునిగిపోయారు. కష్టపడి వెసిన పందిరంతా స్వహస్తాలతో పీకెయ్యాల్సి వచ్చేసరికి ఈరయ్య మనసు ఉసూరుమంది. మూడురోజులుగా వేసిన పందిరి మూడుగంటలలో నేలమట్టమైంది. సాయంత్రం వరకు అదే స్థానంలో పట్నం నుంచి ప్రత్యేకంగా జీపులలో తెప్పించిన షామియానాలు వెలిశాయి.

మరునటి రోజు ఉదయం కొందరు ఆఫీసర్లు మంత్రిగారి కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చారు. పెదకాపు చేస్తున్న పనులకు తీసుకున్న శ్రద్ధకు వారు తృప్తిపడ్డారు. మంత్రిగారి రక్షణకోసం ఎట్టి అవాంతరాలు జరగకుండా ఉండేందు కోసం ముందు జాగ్ర


నెలకు రు. 1000/-
సంపాయించండి
ఎలక్ట్రిక్ అండ్ రేడియో గైడ్
ఎలక్ట్రికల్ మెకానిజం, హోమ్ వైరింగ్ వగైరా మరియు రు. 35/-లలో రేడియోను ఎలా తయారు చేయాలి, చిన్న పెట్టుబడితో ఇంటివద్ద మరమ్మత్తులు తెలుసుకొనేందుకు ఉపయోగపడే చిత్రములతో కూడిన పుస్తకం ధర రు. 12/- పోస్టేజి 2/-. 300 డబ్బు సంపాయించే రహస్య పథకం 15/-.
VANDANA BOOK DEPOT
Rafat Ganj, Aligarh.



ఫ్రెంచి
ఉచిత పోస్టలు ట్యూషన్ : 4 మాసముల సర్టిఫికెట్ కోర్సు. వివరములకు సొంత చిరునామా కలిగిన పోస్టలు కవరు పంపండి.
Principal
IMPERIAL
INSTITUTES (PLF)
Doriwalan, Delhi-5.



డా॥ పి. వి. కె. రావ్, B.A., సెక్సుస్పెషలిస్ట్

వైద్యవిద్వాన్-వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్రస్ఖలనము-శుక్లనష్టము, సుఖ రోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.
రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700.
SUVARNA

త్తగా పదిమంది పోలీసులను అక్కడ నియమించారు. వారు ప్రతిరోజు ఊరును కొలుస్తూ పని పాటలు లేకుండా పెదకాపు యింట్లోపడి కోడిపలావ్‌లు మెక్కుతున్నారు.

ఉన్న పోలీసులకు, వచ్చే ఆఫీసర్లకు తగు విధంగా మర్యాదలు చేసేందుకు.... ప్రత్యేకమయిన శ్రద్ధ తీసుకుంటున్నాడు పెదకాపు.

బియ్యం మరకు పట్టించి బస్తాలను దేవిడీ బంకుల్లో పెడుతూన్న ఈరయ్యకు గూడెంనించి పోశిగాని బిడ్డవచ్చి చెప్పింది "తన బిడ్డ కలవరిస్తోందని సమ్మక్క తొందరగా రమ్మన్నదని."

అది వింటూనే ఈరయ్య నీరుగారి పోయాడు. ఇదివరకే తండ్రిమాటలు విన్నప్పటినుంచి ఉత్సాహంలేక తిరుగుతున్నాడు. ఇప్పుడీ కబురు తెలిసేసరికి.... కాళ్ళు చేతులు చల్లబడినట్టుగా అయిపోయాడు. ఇంకా హమామ్‌ఖాన గొయ్యి త్రవ్వేపని అలానే వుండిపోయింది. ఎంత రాత్రయినా ఆపని పూర్తి కావాలన్నాడు రెడ్డి. లేకపోతే వీధిలోని మురికి కాల్వలోకి మళ్ళీ నీరుపోయే ప్రమాదం వుందని గట్టిగా హెచ్చరించాడు "ఆ పని పూర్తికాకుండా ఇంటికి పోయేటందుకు చిన్నదొర సచ్చినా ఒప్పుకోడు. ఎట్లా" అనుకున్నాడు.

"ఈరిగా.. హమామ్‌ఖాన్ల పని నేనొక్కన్ని సూసుకుంట లేర.. నువ్వోసారి యింటికిపోయి సంటిదాన్ని సూసిరా యీలయితే మందిప్పించుకో." పోశయ్య అన్నాడు.

ఆ సమయంలో పోశయ్య దేవుడిలా కనుపించాడు ఈరయ్యకు. తేలికపడ్డ హృదయంతో యింటికి కదిలాడు. యింటికి పోతున్న అతన్ని షామియానా క్రింద పీకలదాకా త్రాగి కూర్చున్న హెడ్ కానిసబుల్ లైట్లకాంతికి ఒళ్ళు తేలిపోతుండగా "ఒరేయ్" అంటూ పిలిచాడు.

ఈరయ్య ఆగిపోయాడు.

"ఒరేయ్ కోటేశు కొట్టుకాడికి పోయి నేనిమ్మన్నానని ఆ సేట్‌ని సుట్టలు అడిగి తీసుకురాపోరా" ముద్దముద్దగా అన్నాడు. కానిసబుల్.

ఈరయ్య పరిస్థితి అంత తీరిగ్గా చుట్టలు తెచ్చేట్టు లేదు "బాంచెను సంటిదానికి పానం బాగలేదని యింటికాడ్నుంచి కబురు అచ్చింది. బిరాన యింటికి పోవాల ఇంకోడికి సెప్పండి" అన్నాడు చేతులు జోడించి.

మరో క్షణంలో ఈరయ్య దవడ అదిరిపోయింది. ఊహించని ఆ ఘాతానికి ఈరయ్య తూలి ప్రక్కకు పడ్డాడు. రెట్టించిన ఆవేశంతో కానిస్టబుల్ లేచి క్రింద పడిన ఈరయ్యను గట్టిగా తన్నాడు. ఈరయ్య మూడుచుట్లు తిరిగి ఓ షామియానా స్థంభానికి తల కొట్టుకున్నాడు. కొన్ని సెకండ్లపాటు షామియానా అంతా కూలిపోతుందా అన్నట్టు ఊగింది.

"బే....సాలె.... సుట్టలు తెమ్మంటే నన్ను తెచ్చుకోమంటావుర కొవ్వు పెరిగిందిరా.... లం....కొ...."

కానిస్టబుల్ మళ్ళీ తన్నడానికి ముందుకు ఉరికాడు.

అప్పటికే అక్కడ ఉన్నవారంతా వారి చుట్టూ గుంపుగా చేరారు.

అలజడి విన్న బుచ్చిరెడ్డి అటువచ్చి కానిస్టబుల్‌ను బలవంతంగా ఆపాడు. అతను కలిగించుకోవడంతో తెల్ల వుసిరికను చూసిన కోడెనాగులా కానిస్టబుల్ రొప్పుతూ కుర్చీలో కూర్చున్నాడు.

"ఈరిగా ఏందిరా గొడవ?"

నుదురుకు ఎడమవైపు పైభాగాన చర్మం చిట్లి రక్తం కారుతున్న ఈరయ్య బలవంతంగా లేచి నిల్చున్నాడు.

ఈరయ్య సమాధానం చెప్పకముందే కానిస్టబుల్ "మాదు సాబ్ సుట్టలు తెచ్చియ్యరా అంటే ఈడు నన్ను తెచ్చుకోమంటడా?" అన్నాడు.

"ఈరిగా అట్లనేరా పెద్దలను అనేది."

"బాంచెను నేనట్ల అనలేదు. ఇంటికాడ పిల్లదానికి సుస్తీగ వున్నదని కబురొచ్చింది. ఇంకోరికి సెప్పమన్న?"

"సువ్వర్ కె బచ్చె.... మల్ల ఝూట్ బోల్తాహై" కానిస్టబుల్ మరోసారి లేవబోయి లేవలేక మత్తుగా కుర్చీల కూలబడ్డడు.

ఈరయ్య గాలివీచిన రెమ్మలా గజగజ వణికాడు.

బుచ్చిరెడ్డికి సంగతి అర్థం అయింది. ఈరయ్య దీనావస్థకు జాలికలిగినా - కానిస్టబుల్‌ను ఏమీ అనలేదు.

"పెద్దోరితో ఎప్పుడూ అలాఅనవద్దురా. నీ బిడ్డకు నేను మందు గోళీలు యిస్తాగాని తొందరగా పోయి చుట్టలు తీసుకునిరా పో"

ఈరయ్య శవంలా కదిలాడు.

అతను చుటలు తెచ్చేసరికి కానిస్టబుల్ కుర్చీలోనే ఒరిగి కాళ్ళను ఎదురుగా ఉన్న షామియానా గుంజకు తాటించి సుషుప్తావస్థలో మునిగివున్నాడు.

అతన్ని లేపాలో....వద్దో....తెలియక 'లేపుతే మళ్ళీ ఏం జరుగుతుందో' అనే భయంతో అలాగే నిల్చున్నాడు.

ఈ లోపుగా బుచ్చిరెడ్డి లోపలినుంచి

గాథావళి:

# ప్రమాదో ధీమతా మపి

ఒకసారి ప్రఖ్యాత విజ్ఞానవేత్త సర్ సి. వి. రామన్‌గారిని ఒక బిచ్చగత్తె బజార్లో కలుసుకొని తన నిస్సహాయతను, నిర్భాగ్యాన్ని గురించి ఏకరువు పెట్టింది. ఆమె మాటలకా మహాశయులు ఆమె నిరాధారురాలై పోయిందని నమ్మేసి



తన మనీ పర్సు తీసి అందులోని చిల్లరంతా ఆమె చేతిలో పోశారు. ఆమె అదంతా చేర్చి లెక్క చూస్తే 3-12-0. (మూడు రూపాయల పన్నెండణాలు) అయింది. వెంటనే చందా పట్టిక తీసి 3-12-0. అని వేసి దానికి ఎదురుగా ఆయనను సంతకం చేయమన్నది. అలాగే నలుగురిదగ్గరా ఏదో పుచ్చుకుంటుందని ఆయన చేవ్రాలు చేశారు.

సాయంత్రం ఇంటికి పోయింతరువాత రామన్‌గారి భార్య "ప్రతీ బిచ్చగత్తెకీ మూడూ ముప్పావలా చందా వేస్తుంటారా యేమిటి?" అని ఆయన్ను నిలదీశారు.

ఆయన "లేదే! నీతో ఎవరు చెప్పారూ!" అంటూ దబాయించారు.


"ఒకళ్ళు చెప్పేదేమిటి? అది వచ్చి మీ సంతకం చూపించి డబ్బు పట్టుకెళ్తేనూ" అన్నదామె.

మరి తెలివిగలవారికి కూడా ప్రమాదాలు తప్పవుగదా!

—అయినాల కనకరత్నాచారి

## మన వర్ధమాన క్రీడాకారులు-1

# డి. ప్రభాకరరాజు



బాంగ్‌కాక్ ఆసియా క్రీడోత్సవాలలో పాల్గొనే అవకాశము కొద్దిలో తప్పిన తెలుగువాడు ప్రభాకరరాజు. ప్రతిభ వున్నా, రాజు ఆంధ్రుడు కావడంతో గుర్తింపు రాలేదు.

24 సంవత్సరముల వయసుగల డి. ప్రభాకర రాజు వాలీబాల్ రంగంలో ధృవతార. శారీరక దారుఢ్యం, పొడవుగల రాజు కోర్టులో దిగి విజృంభించి ఆడుతుంటే ఎదుటి జట్టు జంకవలసిందే. ఆల్‌రౌండర్, స్మాషింగ్‌లో టాప్. కోర్టు డిఫెన్సు, బ్లాకింగ్‌లో దిట్ట. వాలీబాల్ ఆటకానికి ఉండవలసిన లక్షణాలన్నీ ఉన్నాయి.

జననం పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరులో, హైస్కూలు విద్యాభ్యాసం కూడా అక్కడే. 1972 లో భీమవరం డి. యన్. ఆర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఆటలలో పాల్గొనడం ప్రారంభించాడు. అంతవరకు క్రీడలలో ప్రవేశములేదు. సేలంలో జరిగిన అంతర్ రాష్ట్ర గ్రామీణ వాలీబాల్ పోటీలలో మన రాష్ట్ర జట్టులో ఆడాడు. ఆ తరువాత సంవత్సరం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బాలుర వాలీబాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన పశ్చిమ గోదావరి జిల్లా జట్టు సారథి. అదే సంవత్సరము తిరుపతిలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ వాలీబాల్ పోటీలలో పాల్గొన్న ఆంధ్ర విశ్వవిద్యాలయ జట్టులో ఆడాడు. 1974 లో ఆంధ్ర విశ్వవిద్యాలయ జట్టుకు కెప్టెన్. కాలికట్‌లో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో ప్రభాకరరాజుకు ఉత్తమ క్రీడాకారునిగా గుర్తింపు లభించింది. 1974, 75, 76 మూడు సంవత్సరములు ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ జట్టులో ఆడాడు. 1975-76లో పురుషుల అంతర్ జిల్లా వాలీబాల్ చాంపియన్‌షిప్‌ను పశ్చిమ గోదావరి జిల్లా జట్టు రాజు నాయకత్వంలో మొదటిసారిగా సాధించింది.

ప్రభాకరరాజు నైపుణ్యము ప్రతిభ గుర్తించి హైదరాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే వాలీబాల్ జట్టుతో ఆడేందుకు ఆహ్వానము లభించింది. 1976 రైల్వే ఆటగాడుగా పాల్గై, కొట్టాయం, మద్రాసు, కాలికట్, విజయవాడ, తెనాలి మొదలయిన ప్రాంతాల్లో అనేక ప్రసిద్ధ టోర్నమెంటులలో పాల్గొని విజయఢంకా మ్రోగించాడు.

1977 లో రాజస్థాన్‌లోని కోటాలో శ్రీరామ్ రేయాన్స్ వాలీబాల్ జట్టుతో ఆడడం ప్రారంభించాడు. మన దేశములోగల ఉత్తమ వాలీబాల్ క్రీడాకారుల్లో కొందరు శ్రీరామ్ రేయాన్స్ జట్టులో ఉన్నారు. వారితో కలిసి ఆడడంతో ప్రభాకరరాజుకు మరింత పేరు ప్రఖ్యాతులు లభించాయి. శ్రీరామ్ రేయాన్స్ జట్టు సభ్యునిగా త్రిపూర్ టెక్స్ టైల్స్ ఆల్ ఇండియా టోర్నమెంటు, నల్లాయి ఫ్రెండ్స్ మద్రాసు, యం. సి. యఫ్. విజయవాడ, తెనాలి పోటీలలో సాధించిన, విజయాలు ముఖ్యమైనవి.

ఈ సంవత్సర ప్రారంభంలో మన దేశంలో పర్యటించిన పారిస్ వాలీబాల్ జట్టుతో మూడు టెస్ట్ పోటీలలో ఆడిన భారత జట్టులో మన ప్రభాకరరాజు ఉన్నాడు. బాంగ్‌కాక్ ఆసియా క్రీడలలో పాల్గొను వాలీబాల్ జట్టు శిక్షణ శిబిరంలో ప్రభాకరరాజు ఎన్నికయ్యాడు.

అఖిల భారత ఖ్యాతినొందిన బుచ్చి రామయ్య, శ్యామ్‌సుందర్, రమణారావుల స్థాయిని అందుకోగల సమర్థతగల మరొక తెలుగువాడు ప్రభాకర రాజు. ఇతనిని తీర్చిదిద్దిన ఖ్యాతి వాలీబాల్ కోచ్ శ్రీ కె. సూరారెడ్డికి లభిస్తుంది. బాంగ్‌కాక్ క్రీడలు తిలకించడానికి శ్రీరామ్ రేయాన్స్ కంపెనీ యితనిని పంపించింది. పలు పత్రికలచే కొనియాడబడిన ప్రభాకరరాజు గురించి తెలుగు పత్రికలు వ్రాయకపోవడం విచారకరం.

—ముకరమ్

బెంచీ మీద పెట్టు. ఇంద ఈ నాలుగు గోళీలు తీసుకపోయి నీ బిడ్డకు నాలుగు ... మను. జ్వరం తగ్గిపోతది. మంత్రిగారొచ్చి పోయినాక మంచి మందు యిప్ప...

కాగితం పొట్లం ఒకటి ఈరయ్యకు యిచ్చాడు.

మెరుసున్న కాగితంలోని తెల్లని టాబ్లెట్స్ అమృతపు గుళికల్లా ఈరయ్యకు కనుపించాయి. చుటలు బెంచీమీద పెట్టి "ఈడున్నట్టు వత్త బాంచెను" అంటూ ఇంటికి పరుగెత్తాడు.

*  *  *

హరిజనుల నివాస స్థలాలకు కేటాయించిన బంజరు భూమిలోని తుప్పలు చెట్లు అంతా నరికి శుభ్రం చేయబడింది. ఎత్తు పల్లాలు త్రవ్వి భూమినంతా చదును చేశారు. ఆ ఉదయం మంత్రిగారు శంకుస్థాపన జరుపవలసిన ప్రదేశాన్ని నిర్ణయించడం కోసం తాసిల్దారు, మరికొంత మంది ముఖ్యమయిన ఆఫీసర్లు మూడు జీపులలో వచ్చారు. వెంట పెదకాపు, బుచ్చిరెడ్డి, మరికొందరు పనివారు కూడా వున్నారు.

జీవితంలో మొదటి మారుగా జీపు ఎక్కిన ఈరయ్య ఆ సుఖంలోని అనుభవానికి పరవశించిపోయాడు. మిగతా పనివారి పరిస్థితి సుమారు అలాగే వుంది.

స్థలమంతా తిరిగి చూసి ఒకచోట శంకుస్థాపనకు అనువుగా వుంటుందని నిర్ణయించారు. శంకుస్థాపన జరగవలసిన స్థలంలోనే షామియానాలువేసి మంత్రిగారి వుపన్యాసం ప్రజలకు వినిపించే ఏర్పాటు కూడా చేయాలనుకున్నారు. తరువాత కొంతసేపు వూరిలో జరిగే సమావేశం గురించి కూడా ఆలోచించారు. శంకుస్థాపనవద్ద జరిగే సమావేశానికీ, సావడివద్ద జరిగే సమావేశానికి మధ్య వ్యవధి రెండు గంటలైనా వుండాలని నిర్ణయించారు. మొదట శంకుస్థాపన జరుగుతుంది కనుక ఆ సమావేశానికి వచ్చే ప్రజలే తిరిగి సావడివద్దకు రావాలి కనుక పునాదిరాయి పాతే స్థానానికి సావడికి మధ్యవుండే స్థలాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

అంతా సరిగానే వుందికాని ఒక అవాంతరం వచ్చింది.

శంకుస్థాపన స్థలానికి కొద్ది దూరంలో ఒక రాయి భూమిలో పాతుకుపోయి వుంది. నేలంతా చదును చేసినా ఆరాయిని అక్కడి నుంచి తొలగించడం కష్టమని ఎవరూ ఆ పని చేయలేదు.

తమ ఆఫీసులో పేపర్ వెయిట్ కూడా తీయలేని ఆఫీసర్లకు ఆ రాయిని తీయించాలని అనిపించింది. మంత్రిగారి దృష్టికి ఆ ప్రదేశం చాలా అనువైనదనే భావన కలిగించాలనే తమ అభిప్రాయానికి ఆ

ఎలాగైనా దానిని పెలగించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా తమ అభిప్రాయాన్ని పెదకాపు చెవిలో వేశారు. మరునాడే మంత్రిగారు వచ్చే రోజు కనుక.... ఆ సాయంకాలానికే ఆ పని పూర్తి కావాలన్నారు.

వారి అభిప్రాయాలకు విలువ ఈయడమే వృత్తిగా పెట్టుకున్న పెదకాపు రాయిని తొలగించేందుకు మాట యిచ్చాడు. ఇవ్వడమే కాక ఆ రాయిని అక్కడినుంచి పెకలించి దూరంగా వేసే పనిని ఈరయ్యకూ, పుల్లయ్యకు అప్పగించాడు.

ఆ మధ్యాహ్నం ఒక జత ఎడ్లను తీసుకుని పోయి పుల్లయ్యా, ఈరయ్యా రాయిని పెకలించే ప్రయత్నంలో నిమగ్నులయ్యారు

గంటసేపు రాయి చుట్టూ గొయ్యి త్రవ్వగా దాని అడుగు కనపడింది. మట్టి రాసులుగా ఒడ్డున చేరింది

"దానియమ్మ రాయి శాన పెద్దగుందిరా" అన్నాడు పుల్లయ్య.

"అవునవును" అంటూ సమర్థించాడు ఈరయ్య.

వారి మాటల్లో ఆ రాయిని మనుషులు త్రవ్వి తీయటం అసాధ్యమనే భావన వుంది.

రాయి అడుగు కనుపించగానే ఇరువురూ పలుగులు దానిక్రిందకు దొప్పించి బలమంతా ప్రయోగించి పెకలించే ప్రయత్నం చేశారు. అయిదు నిమిషాల అనంతరం వారి కృషి ఫలించింది.

రాయి కొద్దిగా కదిలింది.

కదిలిన రాయిని పైకి లేపి పలుగుల ఆసరాతో అలానే వుంచి బలమైన మోకులను దాని క్రిందుగా చేర్పించారు. ఆ మోకులను ఎడ్ల కాడికి కట్టి అదిలించసాగారు. గంట ప్రయత్నం తరువాత రాయి పూర్తిగా కదిలి ఓ ప్రక్కకు తిరిగింది.

ఆ సరికి పొద్దుకూడా ఓ ప్రక్కకు వాలింది.

రాయి పూర్తిగా కదిలినా గోయిలోనుంచి పైకి లాగే మార్గం వారికి తోచలేదు. ఎడ్లను బలంగా అదిలించడంలో పలుగులను రాయి అడుగులో వుంచడంలో కొంతవరకు పైకి లేపగలిగారు

పగటినుంచి వారు పడుతున్న శ్రమను చూడలేక సూర్యుడు కొండ చాటుకు తప్పుకున్నాడు.

వారు పడిన శ్రమకు ఎంతవరకు ఫలితం సాధించగలిగారో పరిశీలించేందుకు ఆఫీసర్లందరిని సాగదోలి పెదకాపు తిరుబడిగా అక్కడకు వచ్చాడు.

ఇంకా రాయి ఆ స్థానంలోనే వున్నందుకు మండిపడాడు.

"ఏందిరా పుల్లిగా ఆ రాయి ఇంక ఉన్నకాడనె ఉందేందిరా. బిరాన తీయండ్రి" అంటూ కసిరాడు.

"బాంచెను పగటినుంచి కట్టపెడతానే వున్నము. కొంచెం పెద్దదయి పైకి లేత్తలేదు"

"మీరు గట్టుకుండి గొయ్యిల పలుగులతో తీత్తే ఎట్లవుద్దిరా. అరేయ్ ఈరిగా. ఆ పలుగు అడ పారేసి నీవు గొయ్యిలకు దిగి సేతుల్తో పైకి లేపరా. పుల్లిగాడు ఎడ్లను అదిలిత్తడు. అయిదు నిమిషాల్ల రాయి పైకి లేత్తది. లాగి అవతల పారేయొచ్చు."

పెదకాపు సూచన వారికి నచ్చింది. అంతవరకు వారికి ఆ ఆలోచన రానందుకు నొచ్చుకున్నారు.

పలుగు క్రింద పారేసి ఈరయ్య గొయ్యిలోకి దిగి కండబలాన్ని రాయిపై ప్రయోగించసాగాడు. పుల్లయ్య వంట్లో శక్తినంత చేతుల్లోకి తెచ్చుకుని ఎడ్లను అదిలిస్తూ గట్టిగా అరవసాగాడు.

వారి కృషికి ఫలితం కనిపించసాగింది.

రాయి కొంచెం కొంచెంగా పైకి లేవసాగింది.

రెట్టించిన ఉత్సాహంతో తన బలాన్ని రాయిపై ప్రయోగిస్తున్నాడు ఈరయ్య. అంతకన్న ఎక్కువ ఆవేశంతో ఎడ్లను అదిలిస్తున్నాడు పుల్లయ్య.

వారి కృషికి, పెదకాపు ప్రోత్సాహం ఊపిరిలా వుంది.

పది నిమిషాలు భారంగా గడిచిపోయాయి.

రాయి గోయి అంచువద్దకు వచ్చింది.

ఈరయ్య వెనకకు తిరిగి రాయిని భుజాలమీద వేసుకుని పైకి నెట్టసాగాడు.

రాయి గోయి అంచుకు వచ్చేసరికి అతను పూర్తిగా గోయిలో కూర్చుండిపోయాడు.

వారిరువురికి మాటలతో ప్రోత్సాహమిస్తున్న పెదకాపు నోట్లోని చుట్ట వేగంగా పొగలు చిమ్ముతోంది.

అంతే....

బలంగా ముందుకు లాగుతున్న ఎడ్లు ఓ క్షణం విశ్రాంతి కోసం ఆగిపోయాయి. ఆ ఒక్క క్షణంలోనే వాటికి తెలియకుండా నాలుగడుగులు వెనక్కి జరిగాయి.

మరో క్షణంలో ఈరయ్య కేక ఆ ప్రదేశంలో ప్రతిధ్వనించింది.

పెదకాపు నోట్లోని చుట్ట జారిపోయింది.

వణుకుతున్న పుల్లయ్య చేతుల్లోని ముల్లుగర్ర క్రిందపడింది.

అప్పుడప్పుడే గూళ్ళు చేరుకుంటున్న పిట్టలు ఈరయ్య కేక వింటూనే ఒక్కసారిగా గోలగా అరుస్తూ పైకెగిరాయి.

మాంసపు ముద్దగా మారిన అతని కేక,

శాశ్వతంగా నిదురించిన అతని కూతురుకు గాని,

మూడు రోజులుగా డొక్కలు మాడుతుండగా, సంటిదాని రోగంతో మానసికంగా కృంగిపోయి అచేతనంగా పడివున్న భార్యకుగాని,

రెక్కలు రాని తన ఆలోచనలకు భవిష్యత్తు లేని తమ బ్రతుకుల గురించి చింతించే ముసలి తండ్రి చెవులకిగాని వినిపించలేదు.

మరునాడు ఉదయం నిర్ణీత సమయంలో శుభ ముహూర్తంలో బ్రాహ్మణుల వేద మంత్రాల మధ్య శంకుస్థాపన మహోత్సవం జరిపిన మంత్రిగారికి అసలే వినిపించలేదు.

★

